
# ఇనుప ముక్కు కాకులు



"అయ్యలారా! ఇన్ని రోజులు తలో నాలుగు ఈత చెట్లను గీసుకుని కల్లు అమ్ముకు బతికాం. చెట్ల రకం, ఎక్సైజ్ పన్నులు, మామూళ్లు ఎవరికి వారే చెల్లించడంతో తడిసి మోపెడై పోయాయి. మనకు మాత్రం ఖాళీ లొట్లు, ఈత చెట్లు మాత్రమే మిగిలాయి. ఇప్పటికైనా మనం సొసైటీగా ఏర్పడదాం. ఎవరో ఇష్టమున్న వాళ్లు ఊళ్లో ఉంటారు. ఇష్టం లేని వాళ్లు డబ్బు తీసుకుని ఏడాది పాటు ఎక్కడికైనా వెళ్లి పని చూసు కుంటారు. ఇలా చేస్తే ఇద్దరికి లాభమే". లేచి నిలబడి చెప్పాడు నర్సింలు.

అతడి మాటలు అందరికీ నిజమేనని పించాయి. నర్సింలును ఎప్పుడూ వ్యతిరేకించే ఒకరిద్దరు వ్యక్తులు కూడా మౌనంగ ఉండిపోయారు. వారి వైపు ఆతృతగా చూస్తున్న నర్సింలుకు మరింత ధైర్యం వచ్చింది. సమస్యను మరింత లోతుగా వివరించడం మొదలుపెట్టాడు.

"మన కుటుంబాలు పదిహేను ఉన్నాయి. మొత్తం ఇరవై ఐదు మంది ఈ వృత్తిలో ఉన్నాం. ఏ నెలలోనూ వెయ్యిరూపాయలు సంపాదించింది లేదు. ఎవరో ఒకరు పాట పాడి మిగిలిన వారికి నెలకు ఇంత డబ్బు ఇస్తానని ఏడాది పాటు మావులా నడుపుకుంటే ఎంతో కొంత లాభముం టుంది. రేటు పెంచాలన్నా క్వాలిటీ తగ్గించాలన్నా ఇష్టమున్నట్టు నడుచుకోవచ్చు. ఇంటికో దుకాణ మైతే అది సాధ్యం కాదు" అన్నాడు.

అది అందరికీ అనుభవమే. ఇంటికో కల్లు దుకాణం కావడంతో పోటీ పెరిగింది. కనీస లాభాలు చూసుకోకుండా అమ్మాల్సి వస్తుంది. ఎప్పుడూ ఎవరో ఒకరి నోట ఈ సొసైటీ పదం

నానుతూనే ఉంది. అయినా ఎవరూ ముందుకు రాలేదు. నర్సింలు నడుం కట్టి ముందుకు కదిలి నెల రోజులు ప్రచారం చేస్తూ ఇల్లిల్లు తిరిగితే గానీ ఇంతమంది జమకూడలేదు.

పెద్దగా వాదోపవాదాలు జరగలేదు. అందరూ సొసైటీ కావడానికి ఒప్పుకున్నారు.

"మూడు వందలా యాభై" పాటను మొదలు పెడుతూ అన్నాడు నర్సింలు.

ఎవరికి వారే ఎంత ఖర్చవుతుందో మనసులో లెక్క వేసుకున్నారు. ఒక సంవత్సరంలో రాబడి, ఖర్చులు అంచనా వేసుకుంటున్నారు.

"నాలుగు వందలు" - ఐదు నిమిషాల తర్వాత రేటు పెరిగింది. అది నారాగౌడు పాట.

"నాలుగు వందల యాభై" నర్సింలు అన్నాడు.

కూర్చున్నవారిలో గుసగుసలు మొదలయ్యాయి. నారగౌడికి కోపంగా ఉంది. మరో యాభై పెంచాలా వద్దా అని ఆలోచించి, "ఐదు వందలు" అన్నాడు. కూర్చున్న వారంతా నారగౌని వైపు విచిత్రంగా చూసారు. మరికొందరు పెదవి విరిచారు.

"అన్నా! ఇగ నువ్వు పాట పాడకు. నెలకు ఒక్కొక్క మనిషికి ఐదు వందలంటే పన్నెండు వెయిలు దాటుతది. జీతాలు చిల్లర ఖర్చులు పది వెయిలు దాటుతయి. ఇంత కల్లు ఎక్కడ అమ్ముతది? మనం ఏడాది పాటు ఎక్కడికైనా వెళ్దాం" - నర్సింలుతో అన్నాడు తమ్ముడు చంద్రం.

ఆలోచనల్లో పడ్డాడు నర్సింలు. మావులా పట్టుకోవాలని ఉన్నా రేటు ఎక్కువగా పెరగడంతో ఏం చేయాలో తెలవడం లేదు. నారగౌడి వైపు ఓరగా చూసాడు. అతడు కూడా పట్టుదలగా ఉన్నట్లు కనిపించింది. మీసాలు దిద్దుకుంటూ ధీమాగా కనిపించాడు. కొద్దిసేపు ఆలోచించి ఎటూ తేల్చుకోలేక తెగింపుగా, "ఐదు వందలాయాభై" అన్నాడు.

అంతవరకు టెన్షన్‌ను దాచుకుని గంభీరంగా కనిపించిన నారగౌడు చిన్న పిల్లాడిలా సంబరపడిపోయాడు. ఎదో మాటగా పాటను పాడాడేగానీ లెక్కలు వేసుకున్నాక గుండె దడ పెరిగింది. హావ భావాలను బయటకు కనిపించనీయకుండా పట్టుదలగా కనిపించి నర్సింలులో పట్టుదలను పెంచాడు.

ఏ లెక్కన నర్సింలు అంత డబ్బును పెంచాడో ఎవరికీ అర్థంకాలేదు. కొద్దిసేపు ఎవరూ మాట్లడలేదు. తర్వాత కలకలం బయల్దేరింది. ఒక్కొక్కరు లేచి నిలబడ్డారు. అటు నర్సింలు చుట్టూ, ఇటు నారగౌడి చుట్టూ మూగారు.

"అన్నా! వద్దనంగ పెంచినవు. ఇప్పుడు మన మీదికే వస్తది. ఎట్ల తెచ్చిస్తం చెప్పు. అమ్మే కల్లు జీతాలకే సాలది. నడుమ వాళ్లను బతికిచ్చుడు" - కోపంగా అన్నాడు చంద్రం.

నర్సింలు మారు పలకలేదు. మౌనంగా చూస్తుండిపోయాడు. పక్కనే ఉన్న చిన్న తమ్ముడు రాములు అందుకున్నాడు.

"ఏం కాదు. ఇంతకు డబుల్ కల్లు అమ్మవచ్చు. బీరు షాపులు బ్రాందీషాపులు బందుపెట్టాలని గవర్నమెంటు ఎలాగూ ప్రకటించింది. మనం కొద్దిగ ఉషారుండాలె."

తమ్ముడి వైపు నవ్వుతూ చూసాడు నర్సింలు. చూస్తూనే నారగౌని వద్ద మూగినవారు ఏమంటున్నారో వింటున్నాడు. వారు అతడిని అభినందిస్తున్నారు. రేటు పెంచి మేలు చేసావని,

నర్సింలుకు అనుభవం లేక పోటీకి దిగాడని, ఎద్దేవా చేస్తున్నారు. నర్సింలు వారి మాటలను పట్టించుకోలేదు. తమ్ములతో బయటకు వచ్చాడు.

మరునాడు మిగిలిన వారికి నెలకు ఐదు వందల యాభై ఇస్తానని ఒప్పందపత్రం రాసి ఇచ్చి కల్లు సీసాలను, పెట్టెలను ఇతర సామాగ్రిని ఏడాది పాటు తన హెండోవర్ చేసుకున్నాడు. ఊరి మధ్యలో ఉన్న ఎడ్ల కొట్టంను కిరాయికి తీసుకుని శుభ్రం చేయించాడు. ఎంతమంది పనివారు అవసరమవుతారో లెక్కగట్టి ఇద్దరు గీతగాళ్లను జీతానికి కుదుర్చుకున్నాడు.

కల్లు సీసాలను కడగడానికి, ఊరిలో పంచడానికి ఇద్దరు పిల్లలను కూడా జీతానికి కుదుర్చుకున్నాడు. ముగ్గురు బావలను కూడా ఏడాది పాటు రమ్మని పోన్ చేసాడు. ఉలి, కత్తి, మోపులతో ఇద్దరు బావలు వచ్చారు. 'వాని చేతికింద నేను పని చేస్తానా' అని ఒక బావ రాలేదు.

మరునాడే నర్సింలు కల్లు దుకాణం తెరిచాడు. ఆ రోజునుండే మద్యనిషేదం అమలులోకి వచ్చింది. తమ్ములు, బావలు, గీతకాళ్ళు సాయంత్రం గీసిన ఈత చెట్ల కల్లును క్యాన్లలో తెచ్చారు. పెద్ద పీపాలో కలిపి సీసాల్లో నింపి పెట్టెల్లో పెట్టాడు నర్సింలు. దుకాణంలో తాగడానికి వచ్చే వారికి అక్కడే ఇస్తూ, ఆర్డర్ ఇచ్చినవారి పేర్లు రాసుకుని ఇండ్లలోకి సీసాలు పంపిస్తూ గల్ల పెట్టెమీద కూర్చున్నాడు నర్సింలు.

రాములు , చంద్రం- ఇద్దరు బావలు ఒక్కచోట చేరి గుసగుస లాడడం మొదలెట్టారు. "ఇలాగైతే మన నెత్తికి బురదనే" గట్టిగా అన్నాడు రాములు. చంద్రం వత్తాసు పలికాడు. బావలు మాకేంటీ అంటూనే ఎగదోస్తున్నారు. వారి చేతుల్లో కల్లులో కలిపే క్లోరోసాం పొట్లం నలిగిపోతుంది. దాన్ని కల్లులో కలపనివ్వలేదని వారి బాధ.

వారి మాటలు విననట్టుగా నటిస్తూనే వింటున్నాడు నర్సింలు. కల్లులో కల్తీ కలుపకుండా ఎక్కువ పెట్టెలు నింపడం ఎలాగా అని ఆలోచిస్తున్నాడు.

❄ ❄ ❄ ❄

వతన్ దార్ల కాలంలో పోలీస్ పటేల్‌కు, మాలీ పటేల్‌కు, పట్వారీకి వాడిక లొట్లు ఉండేవి. వాటికి కొన్ని షరతులు ఉండేవి. పొద్దు పొడవకముందే లొట్టి ఇంటిముందుండాలి. నీళ్ళ, కల్తీ ఏదీ లేకుండా ఒకే చెట్టుకు దిగినదై ఉండాలి. ఆ చెట్టు సదరు వ్యక్తి ఎన్నుకున్నదై ఉండాలి. వాడిక లొట్టిని ఉచితంగా ఎలాంటి లాభమును ఆశించకుండా పంపించాలి.

పట్వారీ వ్యవస్థ రద్దయింది కానీ వాడిక లొట్టి రద్దు కాలేదు. పటేలు, పట్వారీల నుండి పెత్తనం గుండాలకు, రౌడీలకు బదిలీ అయినట్టె వాడిక లొట్టి కూడా బదిలీ అయింది. అలాంటి వాడిక లొట్లు ఇప్పుడు ఊరిలో ఆరు ఉన్నాయి.

ఒకటి సాకలోల్ల పెద్దమనిషి రాజంది. పోలీసులు రాజంను అరెస్టు చేసేవరకు ఊరిలో సగం మందికి కూడా అతడి పేరు తెలియదు. నక్సలైట్లతో పరిచయమున్నదని తెలిసాక అతడి పలుకుబడి పెరిగిపోయింది. సాకలోళ్ళు వెట్టిసాకిరి చేస్తున్నారని, బట్టలు ఉతికినందుకు ఎరం పెంచాలని అందరి చేత బట్టలుతకడం బందు చేయించాడు. అతడికి భయపడి ఎవరూ ఎదురు చెప్పలేదు.

అన్ని కులాలతో ఒప్పందం కుదిరింది కానీ గౌడ కులం వద్ద పేచీ మొదలయింది. అదనంగా

ఇంటికి రెండు కల్లుసీసాలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు రాజం. అలా చెయ్యలేమని రాజం ఇంటికి వాడిక లొట్టిని పంపి ప్రసన్నం చేసుకున్నారు. అందులో ఏ మాత్రం క్వాలిటీ తగ్గినా మురికి బట్టలు మూలకే ఉంటాయన్న భయంతో ఎమర్జెన్సీ కోటా కింద వాడిక లొట్టి రాజం ఇంటికి నడిచిపోతూనే ఉంది.

రెండవ లొట్టి కుమ్మరి మల్లయ్యది. బాలాగౌని దగ్గర ఖాతా తెరిచి ఐదువందల రూపాయల య్యాక పైసలిస్తేనే కల్లు పోస్తానని ఒత్తిడి చేస్తే, బల్లిని చంపి కల్లు సీసాలో వేసి, బల్లి పడిన కల్లు అమ్మారని పంచాయితీ పెట్టించాడు. తన కులస్తులెవ్వరూ కల్లు తాగకుంట కట్టడీ చేసాడు.

ఆ ఊరిలో సగం ఊరు కుమ్మర్లదే. మల్లయ్య కొద్దిగా చదువుకున్నోడు. కరంటు మోటర్ల సాంక్షన్‌కు, బ్యాంకు లోన్లకు చిన్నగా పైరవీ చేస్తాడు. పైగా సర్పంచ్‌కు కుడిభుజం.

ఎప్పుడు ఏ పని పడుతుందోనని కులస్తులు భయపడి అతని మాటలు కాదనలేదు. మరునాడు కల్లు గిరాకీ సగం పడిపోయింది. పైసలడగటం తప్పేనని ఒప్పుకుని, బతిమాలి వాడిక లొట్టితో సంధిచేసుకున్నారు గౌండ్లు. కులంలో మల్లయ్య పట్టు రోజు రోజుకు పెరిగిపోవడంతో వాడిక లొట్టి పరిమాణం, నాణ్యత పెరిగింది కానీ తగ్గలేదు.

మూడవ లొట్టి నాగరాజుది. ఎప్పుడూ నలుగురు మనుషులు వెంట ఉంటారు. నోరు విప్పాడంటే దొర, దాత ఎవరినీ లెక్కచేయడు. ఎవరెవరు ఏమేం చేస్తున్నారో, ఏయే బలహీనత లున్నాయో అరిచి చెబుతాడు. రెండు సీసాలు కడుపులో పడ్డాక గౌండ్లు ఎవరెవరికి ఊడిగం చేస్తున్నారో, వాడికలు కడుతున్నారో చెప్పి కల్లు బాగా లేదని సీసాలు పగులగొడ్తాడు. తల్లినాలు మొదలుకొని గౌడులను బండ బూతులు తిడుతాడు. కల్లులో ఏం కలుపుతారో, ఎక్కడి నుండి తెస్తారో అన్నీ చెబుతాడు.

అతడు కల్లు తాగడానికి వచ్చాడంటే ఆ చుట్టుపక్కలకు ఎవరూ రారు. అతడి నోరును మూయించడానికి, తమ రహస్యాలను రహస్యంగా ఉంచడానికి గౌండ్లు పొద్దు పొడవకముందే వాడిక లొట్టిని ఇంటికి పంపే ఏర్పాటు చేసి అతడు దుకాణంలోకి రాకుండా జాగ్రత్తపడ్డారు.

నాలుగవ లొట్టి మాదిగి కుంటయ్యది. అతడికి ఊరిలో ఉద్దెర పుట్టదు. ఒకనాడు దేవగౌడు కల్లు ఉద్దెర నమ్మలేదు. మీసాలు మెలివేస్తూ కోపంగా వెళ్ళిపోయాడు కుంటయ్య. మరునాడు దేవగౌడు ఒంటినిండా పొక్కులు పొడిచాయి. లీటరున్నర పాలిచ్చే బర్రె పాలియ్యలేదు.

మరునాడు మరొక దుకాణంలో ఉద్దెర ఇవ్వనందుకు అతడి కూతురుకు జ్వరం వచ్చింది. కుంటయ్యకు మంత్రాలు వస్తాయన్న వాదన బలపడిపోయింది. 'చూస్తా చూస్తా! గౌండ్లోళ్ళు నాటుక మాడుతున్నారు. కల్లుల మల్లెలు మెలువాలె. రోజుకో పుస్తె తెగాలె' అని మీసం మెలివేయగానే అతడి చల్లని దీవెన కోసం వాడిక లొట్టి కుంటయ్య ఇంటికి నడిచివెళ్ళింది.

ఐదవ లొట్టి అంజిరెడ్డిది. అతడు లేనిది ఊరిలో ఏ పంచాది జరుగదు. కుక్కను నక్కని నక్కను కుక్కని మాటల గారడితో మెప్పించగలడు. గుండె ధైర్యం లేకున్నా మాట భీకరం, నక్క జిత్తులు ఎక్కువ. ఊళ్ళోకి బతకడానికి వచ్చి రెండు వర్గాల మధ్య తాగాదాల్లో తలదూర్చాడు. అంజిరెడ్డి మద్దతు ఇచ్చిన వర్గానిదే అంతిమ విజయం కావడంతో ప్రజల్లో పట్టు దొరికిపోయింది. పై నలుగురు వాడిక లొట్టి మనుషులు అంజిరెడ్డి మనుషులే. కల్లు రేటు పెంచాలన్నా, కల్తీ రేటు

పెంచాలన్నా అంజిరెడ్డి అనుమతి కావాలి. లేదంటే పై నలుగురు వ్యక్తులు రంగంలోకి దిగుతారు.

ఆరవ లొట్టి సర్పంచ్‌ది. కేసులు, పైరవీలు, పనుల వ్యవహారమంతా చూస్తాడని లొట్టి కట్టారు. పదవి ఎవరి చేతుల్లో ఉంటే వాడిక లొట్టి వారింటికి నడిచిపోతుంది. ఇలా ఏలిన వారి ఇళ్ళల్లో తెల్లవారకముందే కొలువు తీరి కళ్ళల్లో మత్తును నింపి కడుపులో దయను పుట్టిస్తుంది వాడిక లొట్టి.

ఉన్నంతలో మంచి కల్లు అందరికీ అందుబాటులో ఉంచాలనుకుంటున్న నర్సింలు దృష్టి వాడిక లొట్లపై పడింది. వెంటనే తమ్ముళ్ళను పిలిచాడు.

"రేపటి నుండి వాడిక లొట్లు మండువాలోనే కలుపాలి. ఆరు లొట్లంటే కనీసం రెండువందల కల్లు. నెలకు ఆరు వేల ఆదాయం" వారిని అంచనా వేస్తూ చెప్పాడు.

క్షణాల్లో వారి మొహం రంగుమారింది. అదే మాట మరొకరంటే విరుచుకుపడేవారే! అన్న కాబట్టి ఆగిపోయారు. ఆ భయం ఉంది కాబట్టే అందరి పెళ్ళిలు అయినా ఆ కుటుంబం ఇంకా ఉమ్మడిగానే ఉంది. కళ్ళతోనే ఒకరికొకరు సైగ చేసుకున్నాక తప్పదన్నట్టు పెదవి విప్పాడు చంద్రం.

"అదేంటిదన్నా.... కొత్త సిస్టం బెట్టినవు. వాడిక లొట్లు ఇపుడు పుట్టినయా..! అట్ల జేస్తే గోరమైతదిగనీ నేను అంజిరెడ్డి పటేలు తోని మాట్లడిన. అద్దతులం బంగారం కొనిస్తనని చెప్పిన. మూడు రూపాయల సీస రేటు నాలుగు రూపాయలు చెయ్యమన్నడు. సర్పంచ్‌కు పావుతులం ఒప్పుకున్న మందునీళ్ళు ఎక్కువ కలుపుమన్నడు. అంత వాళ్ళే చూసుకుంటనన్నరు." తడబడుతూ అయినా, బావలతో కలిసి చేసిన పనిని చెప్పాడు.

అవాక్కయిపోయాడు నర్సింలు. కొన్ని క్షణాలు నోట మాట రాలేదు. తమాయించుకుని కోపంగా చెప్పాడు. "అవేవీ అవసరంలేదు. మనం నిజాయితీగా ఉన్నంతవరకు ఎవరూ మనను ఏం చేయలేరు. ముందుగా వాడిక లొట్లను దుకాణంలోకి తేండ్రి. వచ్చే నెల నుండి ఎక్సైజ్ వాళ్ళకు పంపే మామూల్లుకూడా పంపను. కల్లులో కల్తీ కలపనప్పుడు వాల్లకు భయపడుడెందుకు."

తమ్ముల్లిద్దరూ మొహాలు చూసుకున్నారు. మోపును భుజానవేసుకుని గొణుక్కుంటూ ఈదుల్లకు నడిచారు. వారికి గుండెలో దడ మొదలయింది.

❄ ❄ ❄ ❄

"రాజ్యం ఇయల్ల కల్లు కమ్మగుంది. నిన్న మొన్న జూసినవా... పుల్లగ రుడ్డు.... నోట్లె పొయ్యరాలేదు. ఇయ్యల్ల నర్సగౌని చేతిగుణం జూసినావు" సీసా ఎత్తి బుక్కెడు తాగి లొట్టలు వేసుకుంటూ అన్నాడు బొందయ్య. రాజవ్వ తలూపుతూ భుజానికున్న వడ్ల జోలెను పక్కకు పెట్టి, వీపుకు వేళాడుతున్న చంటిపిల్లను కిందికిదించింది. కల్లు సీసాను ఎత్తి రెండు బుక్కలు తాగి కనుబొమ్మలెగురేస్తూ "అవును. మంచిగుంది. బేకోటు తీస్తే ముక్కులనుంచి పొగత్తుంది. ఏం కలిపినవు గౌడా!" అన్నది.

"ఏం లేదు. వాడిక లొట్లు కలిపిన. మందు కలుపుడు, చెక్కలు కలుపుడు బందు చేసిన" గల్లపెట్టె మీద కూర్చుని నవ్వుతూ అన్నాడు నర్సింలు.

చదువు రాకపోయినా రాజులు, రాజ్యాల కథలు చెప్పగలడు బొందయ్య. మద్దెల వాయిస్తూ వంత పాడగలదు రాజవ్వ. కథలు చెబుతూ ఊర్లు తిరుగుతారు. ఏ ఊర్లో ఎప్పుడుంటారో తెలియదు

కానీ కల్లాలు వచ్చాయంటే ఈ ఊరొస్తారు. బొందయ్య సరసంగా రాజవ్వను 'రాజ్యం' అని పిలుస్తాడు. 'ఆ ఏంటి....ఒస్తున్నా.. అంటూ యాసగా మాట్లాడుతుంది రాజవ్వ.

రోజూ చెరొక సీసా తాగేవారు ఈ రోజు రెండు సీసాలు తాగి బయటపడ్డారు.

"నర్సగౌడు మంచి కలేజా ఉన్నోడు. లేకుంటే వాడిక లొట్లు బందువెట్టే దమ్ము ఎవనికుంటది" జోలెను సర్దుకుని నడుస్తూ అన్నది రాజవ్వ.

"చిన్నప్పటి నుంచి ఇంతే... ఎవలకు అన్యాయం జరిగినా ముందుకు వచ్చి మాట్లాడుతుండె. ఇంతదాక ఇంటికొక్క దుకాణం ఉండుటవల్ల నాకేందంటే నాకేందనుకున్నరు. సొసైటి అయినంక పెద్ద మనుషుల సంగతి ఏర్పడుతుంది. ఇట్లయితదని తెలిస్తే సొసైటీ కానియ్యక పోదురు" తంబురాను, తలపాగను సదురుకుంటూ అన్నాడు బొందయ్య

"ఇదేదో బాగానే జరిగేట్టుంది. అలవాటైన పాణం ఊకుంటదేంది?" సందేహం వెలిబుచ్చింది రాజవ్వ.

"ఊకోపోతే ఉరిబెట్టుకుంటరు. నర్సగౌడు మొండి మనిషి" తంబురామీటుతూ అన్నాడు బొందయ్య.

రాజవ్వ పక్కున నవ్వింది. జారిపోతున్న కూతురును పొదివి పట్టుకుని వేళ్ళకు తొడిగిన కణికలను గలగల ఊపింది.

అప్పటికే పొద్దుపైకెక్కింది. వాళ్ళకు కైపెక్కింది. సీసాల్లో కల్లు బుసబుస పొంగుతుంది. వాడిక లొట్ల పెద్దమనుషులు కూడా బుసబుస పొంగుతున్నారు. వారికి అడుగు దూరంలోనే వెనకగా వస్తున్న నాగరాజు వారి మాటలన్నీ విన్నాడు. రాజ్యం నవ్వు గుండెను కెలికితే బొందయ్య మాటలు కారంచల్లాయి. చక్కగా అంజిరెడ్డి ఇంటివైపు నడిచాడు.

అప్పటికే మిగిలిన వారు అక్కడికి చేరుకుని మాయమైన లొట్టి గురించి మంతనాలు చేస్తున్నారు. లొట్టి రావడం లేదన్న నిజం కంటే తమ పెత్తనానికి కాలం చెల్లిపోయిందన్న నిజాన్నే వారు జీర్ణించుకోలేకపోతున్నారు. 'అదునా బాలసంతోల్లకు కూడా మనం లోకువయ్యామని నాగరాజు చేరవేసిన విషయం పుండుమీద కారం చల్లినట్లయింది. ఎలా దెబ్బ కొట్టాలా అని ఆలోచనల్లో పడ్డారు.

వారం రోజులు గడిచాయి. కల్లులో కల్తీ తగ్గింది. క్లోరోఫాం, కుంకుడు రసం, చెక్క మందు వాడుకం లేదు. గిరాకీ అనుకున్నట్టుగా పెరిగింది. మధ్యపాన నిషేదంతో మంది ఈత చెట్లు వెతుక్కుంటూ వస్తున్నారు. కల్లు ఈదుల్లోనే సగం అమ్ముడవుతుంది.

ఎప్పటిలా ముసి ముసి మబ్బుల తమ్ముళ్ళను, బావలను నిద్రలేపి ఈదుల్లకు పంపి దుకాణంలోకి వచ్చాడు నర్సింలు. జీతమున్న పిల్లలిద్దరికీ లిస్ట్ ఇచ్చి సీసాలు తేవడానికి ఊరిలోకి పంపించాడు. మిగిలిన సీసల్ని కడిగి పెట్టెల్లో పెడుతుండగా తమ్ములిద్దరూ ఖాళీ చేతులతో తిరిగివచ్చారు.

"అన్నా.... చూసినవా! వాళ్ళు ఎంత పని చేసింద్రు. ఏ రాత్రో వచ్చి సగం లొట్లు పలుగ్గొట్టింద్రు. నువ్వు చెబితే వినవు. ఇప్పుడు ఎంత లాసు వచ్చిందో చూడు" కోపంగా అన్నాడు చంద్రం. పగలగొట్టిన వారి పైన కంటే నర్సింలు పైనే ఎక్కువ కోపంగా ఉందతనికి.

"ఎవల బుక్క వాళ్ళకు ఏస్తే మన బుక్క మనకు మిగులుతది. వాళ్ళుకూడా మందో మాకో కలిపి కల్లుఎక్కువ జేసుకుని అమ్ముకొమ్మంటుండ్రు. ధర పెంచుమంటుండ్రు. మంచి మాటలు చెప్పినోళ్ళకే మనం ఎసరు పెడితిమి. ఇప్పటికైనా వాడికలు కట్టాల్సిందే" భయంగానైనా సూటిగా అన్నాడు రాములు.

నర్సింలు గుండె దడీలు మంది. ఇంతవరకెన్నడూ అలా జరుగలేదు. నోటి మాటలతో బెదిరించేవారు. శత్రువులు ఆవైపు నుండి నరుక్కోస్తారని ఊహించలేదు. కొద్దిసేపు కలవర పడినా స్థిరంగా అన్నాడు.

"మనం జనం దగ్గర డబ్బు తీసుకుంటున్నాం. వాళ్ళకు మంచి కల్లును అందిద్దాం. వాళ్ళందరి కడుపులు కొట్టి వీరి కడుపులు నింపుడెందుకు? ఈ పద్దతికి ఎప్పుడో ఒకప్పుడు స్వస్తి చెప్పాల్సిందే! లేదంటే గీసుకోవడానికి మనకు ఈత చెట్లు మిగలవు. చెట్టుకొక గూండా పుట్టుకొస్తారు"

అన్న వైపు చిరాగ్గా చూసాడు చంద్రం. రాములు మారు మాట్లాడకుండా విసవిసా వెళ్ళిపోయాడు. తమ్ముళ్ళకు కోపం వచ్చిందని గ్రహించాడు నర్సింలు. నిజాన్ని ఆలస్యంగానైనా వారే గ్రహిస్తారనుకుని తన పనిలో మునిగిపోయాడు.

అరగంటలో కల్లు క్యాన్‌లు వచ్చాయి. ఎప్పటిలా కాకుండా కోపంతో చిటపట లాడుతూనే కనిపించారు బావలు. రోజూ క్యాన్‌లు దించగానే ఇంటికి వెళ్ళేవారు. ఈ రోజు అక్కడే నిలబడ్డారు. వారు ఎందుకు నిలబడ్డారో అర్థమయింది నర్సింలుకు. మౌనంగా క్యాన్లలోని కల్లుని ట్యాంక్‌లో వంచి కల్లు కలిపి సీసాల్లో నింపాడు. సగం సీసాలు కూడా నిండలేదు. అది చూసి పెద్ద బావ పెద్దగా, చిన్న బావ చిన్నగా నవ్వారు.

"ఇట్లయితే మనం బతుకం. పెండ్లాం మీది పుస్తెమట్టెలు అమ్ముకున్నా అప్పులు తీరయి. చెంచెడు సి.హెచ్., గ్లాసెడు కుంకుడు రసం, రంగు కొరకు సిల్వర్ పౌడర్ రుచికోసం చెక్రిన్, చెక్కెర, నురుగు కోసం ఈస్ట్ కలిపి నాలుగు కుండల నీల్లు పోస్తే సీసలన్నీ నిండుతయి. నీకు కలుపరాకపోతే నేను కలుపుత" అడుగు ముందుకు వేస్తూ అన్నాడు చిన్నబావ.

"న్యాయంగా బతుకుడే నాకిష్టం. ఒకల కడుపు గొట్టి తినుడెందుకు" స్థిరంగా అన్నాడు నర్సింలు.

ముందుకు నడువబోతున్న బావ అలాగే ఆగిపోయాడు. ఆ మాటలతో మొహం మీద కొట్టినట్టయింది. మొహం ముడుచుకుని వెళ్లిపోయాడు. ఇదంతా గమనిస్తున్న నర్సింలు పెద్దబావకు అరికాలి మంట నెత్తికెక్కింది.

"నువ్వు నిజంగా సగం పిచ్చోనివి. ఊరును ఏదో ఉద్దరిస్తున్నట్టు మాట్లాడుతున్నవు. అంత న్యాయంగా బతుకాలనుకున్నోనివి కల్లును ఎందుకు అమ్ముతున్నవు? కల్లు అమ్ముడంటేనే ప్రజల్ని మోసం చేసుడు. పొద్దంతా కూలీ చేసినోడు రెండు సీసల కల్లు తాగితే మత్తుగా నిద్రపోతడు. అదే కల్లు తాగలేదనుకో, 'తాను ఎన్నేండ్ల నుండి కూలీ చేస్తున్నాను? ఎందుకు చేస్తున్నాను? బతుకు ఎందుకు మారడం లేదు? కూలీగానే ఎందుకు మిగిలిపోతున్నాను? అని రాత్రంతా ఆలోచిస్తాడు. మధ్య తరగతి మనుషుల్ని ఆలోచించకుండా చేసే ఆయుధమే కల్లు. గొంగట్ల కూర్చుండి వెంట్రుకలు అంటద్దన్నట్టు కాని పని చేసుకుంటనే న్యాయం, ధర్మం అంటున్నావు" ఆవేశంగా అన్నాడు.

చేస్తున్న పని ఆపి కొన్ని క్షణాలు ఆశ్చర్యంగా చూసాడు నర్సింలు. ఎప్పుడూ ముభావంగా

ఉండే పెద్దబావ అంత ఆవేశంగా, అంత లోతుగా మాట్లాడుతాడనుకోలేదు. తను ఏ విధంగా చెప్పినా వారు మరోలా అర్థం చేసుకుంటారని పెద్దగా వాదించలేదు కానీ కల్తీ కలిపేది లేదని మాత్రం ఖచ్చితంగా చెప్పాడు.

"నీ యిష్టం, చెప్పంగ విననోన్ని చెడంగ చూడాలె" విసవిసా బయటకు నడుస్తూ అన్నాడు బావ. నర్సింలు మౌనంగా గల్లపెట్టె పైన కూర్చున్నాడు. అతడి ఆలోచనలన్నీ పగిలిపోయిన లొట్లపైనే ఉన్నాయి. గిరాకీ అంతగా లేకపోవడంతో కొత్త లొట్ల కొరకు కుమ్మరి ఇండ్లవైపు నడిచాడు.

కుమ్మరి వాళ్ళు ముందుగా లొట్లు లేవనే చెప్పారు. బతిమాలితే జాలి తలిచి ఇస్తున్నట్లుగా చెప్పి నలభై రూపాయలకొకటి ఇస్తామన్నారు. అంతకుముందు పది రూపాయలకొకటి నేనిస్తానంటే నేనిస్తానని పోటీ పడుతూ వచ్చేవాళ్ల హఠాత్తుగా రేటును నాలిగింతలు పెంచి అందరూ ఒకే మాట మాట్లాడడం వెనుక ఎవరున్నారో అర్థమయింది నర్సింలుకు. ఎవరిని అడిగినా ఒకటే మాట.

వాడిక లొట్టిని ఎందుకు ఆపేయాల్సి వచ్చిందో చెబుతూ ఆ ఒక్కడి మాటకు బలాన్నివ్వడానికి మీరంతా ఒక్కటి కావల్సిన అవసరం లేదని చెప్పాడు. ఎవరూ పట్టించుకోలేదు. బిరుసుగా తల ఎగరేస్తూ "మా కుమ్మర్లంటే ఏమనుకున్నవు! మామూటి ఒక్కటి, మాట ఒక్కటి" అన్నారు.

చేసేది లేక చెప్పిన రేటుకే డబ్బు లెక్కగట్టి ఇచ్చి ఇంటికి వచ్చి తమ్ముళ్ళను తోలించాడు. వారు సైకిళ్ళ మీద లొట్లను ఈదుల్లకు జారవేసారు. ఆ రోజు నుండే తమ్ముళ్ళను, బావలను రాత్రి పూట ఈత చెట్ల కాపలాకు పంపి ఎంతమేరకు ఎవలు చూసుకోవాలె హద్దులు నిర్ణయించాడు నర్సింలు.

ఎవరూ బయటపడలేదు కానీ మనసులో నర్సింలును తిట్టుకున్నారు. 'ఈ చీకట్లో ఎట్లా కావలికాస్తాం? వాళ్ళకు లొట్లు బందుపెట్టి మనం సంపాదించుకుంది ఇదేనా....?' అనుకున్నారు. ఒకటి రెండు రోజులు కాపలా వెళ్ళి ఇక వెళ్ళమని చెప్పాలనుకున్నారు.

❄ ❄ ❄ ❄

"అన్నా.... భూంరెడ్డి సచ్చిపోయిండట. దింపుడు కల్లం కాడికి పదకొండు పెట్టెల కల్లు తెమ్మన్నరు. పైసలిచ్చిండ్రు" నోట్లను అందిస్తూ అన్నాడు చంద్రం. నర్సింలు అప్పుడే కల్లు కలుపుతున్నాడు. చిన్నబావ అక్కడే ఉన్నాడు. చంద్రం మాటలు వినగానే దగ్గరకు వచ్చి, "అయితే ఇంకేం కనీసం ఐదు పెట్టెలైనా ఎక్కువ కలపాలి" అన్నాడు.

క్యాన్‌లు వంచుతున్న వాడల్లా ఆగి వెనక్కి మరలి చూసాడు నర్సింలు.

"అదేనోయ్ రోజూ పదిహేను పెట్టెల కల్లే గదా కలిపి అమ్మేది. పదకొండు పెట్టెలు చావుకే పంపితివి. దుకాణంలో మిగిలేది నాలుగు పెట్టెలు. మందు నీళ్లు కలిపి ఇంకో పది పెట్టెలు కలిపినా అమ్ముతది. గాలి తీరు గౌడు అంటే ఇదే!" కోపాన్ని అనుచుకుంటూ చెప్పాడు. విని కూడా విననట్టే కల్లు కలిపి పదకొండు పెట్టెలను ఒకచోట పెట్టి మిగిలిన నాలుగు పెట్టెలను అమ్మడానికి పెట్టాడు. బావలు తమ్ముళ్ళు గొణుక్కుంటూ వెళ్ళిపోయారు.

మధ్యాహ్నం దాటకముందే కల్లు అమ్ముడుపోయింది. చావు కల్లు మిగిలింది. శవాన్ని మోసుకుపోయాక వాగులకు పంపించాలి. అందుకొరకు ఎడ్ల బండిని కూడా మాట్లాడి ఉంచాడు నర్సింలు. ఉద్దెర నగతును లెక్కిస్తుండగా పది మంది హమాలీలు దుకాణంలోకి వచ్చారు. అప్పుడే

లారీలో వడ్లను నింపినట్లున్నారు. ఆయాసంతో వగరుస్తున్నారు.

"నర్సన్నా పది సీసల కల్లు ఇయ్యి" ఒకడు అన్నాడు.

"లేదు తమ్మీ! కల్లు అయిపోయింది." తలెత్తకుండానే చెప్పాడు నర్సింలు.

"అరే! అంత కల్లు ఉంది. లేదంటవేందే! ఉద్దెర కాదు. నగతు ఇత్తం" ఒకడు అన్నాడు.

"అది సావు కల్లు. జరాగితే వాగులకు పోతది"

"కల్లు తాగకపోతె మేంగూడా అటే పోతం దూపయితుంది. జెట్టన ఇయ్యి. ఇంకోలారీ నింపాలె" మరొకడు విసుగ్గా అన్నాడు.

పదిమంది పది కులాలకు చెందినవారు. పైగా లొట్టి పెద్దలకు నమ్మినబంట్లు వాళ్లకు నర్సింలు చాలా అన్యాయం చేసాడని రోజూ బాధపడుతూ, కోపాన్ని పెంచుకుంటున్నారు కూడా. తాడో పేడో తేల్చుకోవాలని పట్టుబట్టడంతో మాటా మాటా పెరిగింది.

నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్నారు. కోపంగా వెళ్ళి ఇద్దరు వ్యక్తులు కల్లుపెట్టెను పట్టుకొచ్చారు. నిమిషాల్లో ఒక పెట్టెను ఖాళీ చేసి వందనోటును గల్లపెట్టె వైపు విసిరి వెళ్లిపోయారు.

బిత్తరపోయి చూస్తుండడం తప్ప ఏమీ చేయలేకపోయాడు నర్సింలు. అక్కడే ఉంటే మళ్ళీ ఎవరైనా వస్తారని దుకాణం మూసివేసాడు. సాయంత్రం పీనుగు వెంట ఎడ్ల బండిమీద పది పెట్టెల్ని పంపించాడు.

దింపుడు కల్లం కాడ పెత్తనం అంజిరెడ్డిదే! సాకలి, మంగలి, దప్పులు, తలారీ లెక్కలు చూస్తూ కల్లు బండిని పది పెట్టెలను చూసి నవ్వుకున్నాడు. బట్టలుతకడానికి వచ్చిన సాకలోళ్ళ లొట్టి పెద్ద మనిషి రాజం, దప్పులు కొట్టడానికి వచ్చిన మాదిగోళ్ళ లొట్టి పెద్దమనిషి కుంటయ్యా అక్కడే ఉన్నారు. వారిని పిలిచి అసలు విషయం చెప్పాడు.

"వీని కావురం జూసినావు. పదకొండు పెట్టెలకు డబ్బులిస్చే పది పెట్టెలు పంపిండు. ఎవలు చూడరనుకున్నడు. నమ్మితే పెట్టెనే అబద్దమాడాలనుకున్నడు." మండి పడుతూ అన్నాడు కుంటయ్యా.

"ఇయ్యల్ల ఇది చేసిండు. రేపు ఇంకొకటి చేత్తడు. వాని కులంల మూటీ ఉంది కాబట్టి సొసైటీ చేసుకున్నరు. మనమందరం మూటీ గుండాలె. మనమంటే ఏమిటో తడాఖా చూపించాలె" కోపంగా అన్నాడు రాజం.

అప్పటికప్పుడే నర్సింలును మోసగాడిగా ప్రచారం చేసారు. ఒక్క సీసా తీసి దింపుడు కల్లం కాడ సాక పెట్టి అగ్గిపెట్టినతనికి తాగించారు. మిగిలిన కల్లును వాపసు పంపారు. బండి దుకాణం చేరే సరికి చీకటి పడింది. గిరాకీ రాలేదు. వచ్చిన ఒకరిద్దరు సావు నుంచి తిరిగివచ్చిన కల్లు వద్దని మరలిపోయారు.

"మేము చెప్పితే యాడింటవు? పొద్దుగల్లనే కల్లు ఎక్కువ కలిపితే ఈ పరేషాన్ ఉండకపోవును గదా.." కోపంగా అన్నాడు చిన్నబావ.. "ఇప్పుడు ఇంత కల్లును ఏంజేద్దాం..!"

ఇంతకంటే ఇంకేం చేస్తరు? కూలీ నాలీ చేసుకునేటోల్లకు అందుబాటుల ఉండే కల్లును కల్తీ చేస్తే వాళ్ళకు లేని రోగాలను తెచ్చిన వాళ్ళమవుతాం. ఇప్పుడు కల్తీ చేయక పోయి.నా మనకు జీతాలకు మిగులుతున్నయి గదా! ఇప్పటికే మీ బలిమితో 'నీళ్లు చెక్కరి, పులుపు కలుపుతున్న'

మనసులోనే అనుకుని పైకి మాత్రం. "ఏం జేద్దాం. పారబోద్దాం" అన్నాడు నర్సింలు స్థిరంగా.

తమ్ములకు అతడు అన్నంత పని చేస్తాడని అర్థమైపోయింది. పెద్ద పెద్ద పట్టణాల్లో ఒక రోజు కళ్ళు మూడు రోజులు అమ్ముతారని, ఈ కల్లును రేపు వచ్చే కల్లులో కలిపి అమ్మితే ఏమీ కాదని ఈ ఒక్కసారి తమ మాట వినాలని నర్సింలును ఒప్పించేసరికి కూరుకు రాత్రి దాటింది.

మరునాడు దుకాణంలో ముప్పయి పెట్టెల కల్లు తయారయింది. లారీ వడ్లు నింపిన హమాలీలు మళ్ళీ వచ్చారు. మనిషి కొక సీసా తాగి పెదవి విరిచారు.

"కల్లు బుడ్డు బుడ్డుంది. నిన్న తాగుతమంటే లేదంటవు. నిన్నటి కల్లును కలిపి ఇయ్యాల్ల అమ్ముతవు. నీ సంగతేంది?" అన్నారు కోపంగా, మాటా మాటా పెరిగింది. పెట్టెలన్నీ ఎత్తేసి సీసల్ని పగులగొట్టారు.

నర్సింలుకు కోపం ఆగలేదు. ఇక సహిస్తే ఇంకా ఎక్కువ ఆగడాలు చేస్తారని పోలీసులకు రిపోర్టు ఇచ్చాడు నర్సింలు. పోలీసులు వచ్చి హమాలీలను పట్టుకుపోయారు. ఈ విషయం క్షణాల్లో ఊరంతా పాకిపోయింది.

అంజిరెడ్డి, సర్పంచ్ మీసాలు మెలివేసారు. వారికి ప్రచారానికి, పగతీర్చుకోవడానికి మంచి విషయం దొరికింది.

"నిన్నటి కల్లు అమ్ముతరు. ఇదేంటిదని అడిగితే పోలీసులకు పట్టిత్తరు. ఇయ్యాల వాళ్ళను పట్టిచ్చిండు. రేపు మనను పట్టిత్తడు. వాని కల్లు తాగుడేంది...? తన్నులు తినుడేంది. ఊరిలో ఎవ్వలు కల్లు తాగవద్దు" అధికారికంగా ప్రకటించారు.

సంగాల పెద్దలను సమావేశపరిచి కట్టడి చేశారు. వెంటనే మాదిగ కుంటయ్య డప్పు పట్టుకుని కల్లు ఎవరూ తాగవద్దని, తాగినోళ్ళకు వంద చెప్పు దెబ్బలు, ఐదు వందల జరిమానా అని చాటింపు వేశాడు. దుకాణం వద్ద ఇద్దరిని కాపలాగా ఉంచారు.

మూడు రోజులు గడిచాయి. దుకాణం వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. నర్సింలుకు ఊరికి మధ్యన విభజన రేఖ గీచినట్టుగా చూస్తున్నారు జనం. రోజు రోజుకు జనంలో పట్టు పెరిగిపోయింది. వాడిక లొట్ల గుట్టు విప్పి 'ఇదంతా కుట్ర, నమ్మవద్దని' చెప్పినా ఎవరూ నమ్మలేదు.

నర్సింలు ఇంట్లో కొట్లాట జరిగింది. బావలిద్దరూ వెళ్ళిపోయారు. తమ్ములు మహారాష్ట్ర పోవాలని చూస్తున్నారు. గీచిన కల్లు గీచినట్టు రోజు రోజూ పారబోస్తు దుకాణంలో కూర్చుంటున్నాడు నర్సింలు.

రాజవ్వ బొందయ్యలు మాత్రం ఊరు తిరిగి బిచ్చం అడుక్కుని దుకాణంలకు వచ్చి కల్లు తాగుతున్నారు. "మాది ఈ ఊరు కాదు బాంచెన్... ఇయ్యాల్ల ఇక్కడ రేపు ఇంకోజాగల. ఏదన్న ఉంటే మీరు మీరు చూసుకోండి" అన్నరు. ఎవరూ వారి గురించి ఆలోచించలేదు.

వారం గడిచింది. నర్సింలు దిగి రాలేదు. సంది చేసుకోవడానికి అన్ని ద్వారాలు తెరిచి పెట్టారు పెద్దమనుషులు. పట్టు విడవకుండా వాడిక లొట్ల వల్లనే ఇలా చేస్తున్నారని ప్రచారం ముమ్మరం చేశాడు నర్సింలు. జరిగే నష్టం ఎవరికో, ఎందుకని కల్తీ చేయడంలేదో చెబుతున్నాడు.

కొద్దిగా జనంలో కదలిక మొదలయింది. నర్సింలు చెప్పేది నిజమేనన్న వాదనకూడా బయలుదేరింది. వాడిక లొట్ల పెద్దమనుషులు ఉలిక్కి పడ్డారు. "ఊరు వాని దిక్కు తిరుగుతున్నరు

ఇట్లనే చూసుకుంట కూసుంటే పట్టు సడలిపోతది'' హెచ్చరిస్తున్నట్లుగా అన్నాడు కుమ్మరి మల్లయ్య. అంజిరెడ్డి బాగా ఆలోచించి మాదిగి కుంటయ్య వైపు తిరిగి అన్నాడు.

"మామా... నువ్వు తలుచుకుంటే కల్లు విషమైతదంటవు గదా! ఏదీ ఒక్కసారి తలుచుకో.'' అందరికీ అర్థమైపోయింది. విషపు నవ్వు నవ్వారు.

కుంటయ్యకు నిజంగానే తల తిరిగింది.

అర్ధరాత్రి దాటాక ఈత చెట్ల వైపు వెళ్ళాడు కుంటయ్య. అతడి వెంట నాగరాజు కూడా ఉన్నాడు. వారి చేతుల్లో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్ పొట్లాలున్నాయి. అవికల్లులో చిటికెడు ప్రమాణంలో కలిపే మందులే. ఏమాత్రం ఎక్కువ కలిపినా గుండె నరాలపై దెబ్బతీసి ప్రాణం తీస్తాయి.

❄ ❄ ❄ ❄

పొద్దు పొడవకముందే కల్లు క్యాన్‌లు దుకాణంలో ఉన్నాయి. ప్రజల ఆలోచనా ధోరణిలో మాటల్లో మార్పు వస్తుందని గమనించాక ప్రచారం ఎక్కువ చేయడం మొదలెట్టాడు నర్సింలు. దుకాణంలోకి వచ్చి కల్లు తాగడానికి భయపడుతున్నారు కాని నైతికంగా తనకే మద్దతునిస్తున్నారని గ్రహించాక ప్రజల్లో తప్పకుండా మార్పు వస్తుందని ఊహించాడు. కట్ట తెగిన ప్రవాహంలా ఎప్పుడో తన దుకాణం నిండుతారనుకుంటూ పొద్దున్నే కల్లు కలిపి గల్ల పెట్టె మీద కూర్చున్నాడు.

"ఏంటి గౌడా! ఇయ్యాలగూడా హర్తాలేనా?'' తంబూరా దించుతూ అడిగాడు బొందయ్య. అతడి వెనుకే రాజవ్వ కూడా ఉంది. అవునన్నట్టు తలూపుతూ రెండు సీసాల్ని అందించాడు.

బొందయ్య సీసాను కిందపెట్టి నర్సింలుతో మాటల్లో మునిగిపోయాడు. రాజవ్వ చంటిపిల్లను కిందికిదించి సీసాను ఎత్తిరెండుబుక్కలు మింగి కిందికి దించింది. కొద్ది సేపటకి కడుపులో మంట మొదలయింది. తలదిమ్మెక్కింది. భర్తవైపు భయం భయంగా చూస్తు లేచి నిలబడి కూతురును ఎత్తుకుంది. అప్పటికింకా బొందయ్య కల్లు ముట్టలేదు.

"ఏంటి రాజ్యం ఏమైంది...?'' ఆత్రుతగా అడిగాడు బొందయ్య.

''కడుపులో మండుతుంది. నెత్తి తిరుగుతుంది.'' చెప్పి అడుగు ముందుకు వెయ్యబోయివిరుచుక పడిపోయింది. చంటిపిల్ల కేక బొందయ్య కేకలో కలిసిపోయింది. అతడికిభయం దుఃఖం పొంగుకువచ్చాయి. ఆందోళనగా 'రాజ్యం రాజ్యం' అంటూ ఏడ్వడం మొదలెట్టాడు. అతడి అరుపులకు చుట్టు పక్కల వాళ్ళు జమకూడారు. నాగరాజు, కుంటయ్యలు కూడా చేరుకున్నారు.

"నర్సిగాడు రాజిని చంపెరా! ఎన్ని రోజుల కల్లో! ఏమందు కలిపిండో! పరిగడుపున తాగంగనే కిందపడ్డది'' కుంటయ్య అన్నాడు నాగరాజు ఎవరినో జీపు కొరకు తరిమాడు.

నర్సింలు కాళ్ళలో వణుకు పుట్టింది. గంటలమీద పోలీసులొచ్చారు. అప్పటికే రాజవ్వను దవాఖానకు పంపించారు. ఎక్సైజ్ వాళ్ళుకూడా వచ్చారు. దుకాణం సీలు చేశారు. కల్లు శాంపిల్‌ను పరీక్షకు పంపించారు. నర్సింలుపై కేసు నమోదు చేసుకున్నారు. అతడు కల్తీ చేసాడని ఊరంతా తెలిసిపోయింది.

దవాఖానాలో బొందయ్య కూతురును ఎత్తుకుని ఏడుస్తూకూర్చున్నాడు. కుంటయ్య, నాగరాజులు అతడి వెంటే ఉండి ధైర్యం చెబుతున్నారు. అబద్దపు సాక్ష్యం చెప్పితే హాస్పిటల్ ఖర్చులు

పోను ఐదువేల రూపాయలు కూడా ఇస్తామని ఆశ చూపారు. బొందయ్య వారి మనిషిగా మారిపోయాడు. నర్సింలు మీద కేసు పెట్టడానికి ఒప్పుకున్నాడు.

హడావుడి అంతా తగ్గాక హాస్పిటల్‌కు వెళ్ళాడు నర్సింలు. అప్పటికి రాజవ్వ కొద్దిగా కోలుకుంది. తాను ఏ మందూ కలుపలేదని ఒట్టుపెట్టుకుని చెబుతూ రాజవ్వ కల్లు తాగలేదని, అప్పుడప్పుడూ కడుపునొప్పి వస్తుండెనని పోలీసులతో చెప్పాల్సిందిగా బొందయ్యను కోరాడు. హాస్పిటల్‌కు మందులకు అయిన ఖర్చులు తనే భరిస్తానన్నాడు.

అప్పటికే నాగరాజుతో ఒప్పందం కుదుర్చుకున్న బొందయ్య ఒప్పుకోలేదు. తన మీద సానుభూతిని చూపే బొందయ్య కూడా సహకరించకపోవడంతో దిక్కు తోచలేదు నర్సింలుకు. నీరసంగా ఇంటికి తిరిగి వచ్చాడు. అదేరాత్రి పోలీసులొచ్చి నర్సింలును పట్టుకుపోయారు.

నర్సింలు పై కేసు విషయం తెలిసి ఇద్దరు బావలు పరుగెత్తుకొచ్చారు. రాములు చంద్రంలతో కలిసి ఆలోచించారు.

"మనం చూసుకుంట కూసుంటే ఇది పెద్ద కేసయితది. సాక్షాలు బలంగా ఉన్నాయి. అన్న పిచ్చోడు. ఆయనకు తెల్వది. మన పని మనం చేసుకుందాం మావులా మనమే తీసుకుందాం. మనమే నడుపుకుందాం" చంద్రం అన్నాడు. అందరు సరేనని ఒప్పుకున్నారు.

అనుకున్నదే తడవుగా ముందుగా అంజిరెడ్డిని, తరువాత సర్పంచ్‌ను కలిసి బతిమాలి ప్రసన్నం చేసుకున్నారు. ఒప్పుకున్న బంగారాన్ని ముందుగానే అప్పగించుకున్నారు. వాడికల లొట్లు తెల్లవారకముందే ఇండ్ల ముందు కొలువుతీరాయి.

గెలుపు తమదేనని తెలిసాక పెద్ద మనుషులు సర్వ శక్తులుపయోగించి ఎక్కడేం చేయాలో అది చేశారు. నర్సింలును మాత్రం స్టేషన్ నుండి బయటకు తేలేదు. రెండు రోజులు ఉంచిగానీ తేమని ముందుగానే చెప్పారు. ఊరిలో తుఫాను వెలిసింది.

రెండు రోజుల్లోనే దుకాణం తాళం తెరుచుకుంది. గల్లపెట్టె మీద చంద్రం కూర్చున్నాడు. కల్లురేటు కల్తీరేటు పెరిగింది. పెట్టెల పరిమాణం పెరిగింది. ఒకరిద్దరు బక్కపలుచటోళ్ళు ఇదేంటిదని అడిగితే "ఇది ఇంతే! నీకు దమ్మున్న జాగల చెప్పుపో" అంటున్నాడు చంద్రం బిరుసుగా. ఎవ్వరూ నోరు మెదపడంలేదు.

బొందయ్యను అతడితో ఒప్పుకున్న ఒప్పందాన్ని పూర్తిగా మరిచిపోయారు పెద్దలు.

అక్కడ హాస్పిటల్లో బిల్లు చెల్లించే పెద్దల కొరకు ఎదురుచూసి మోసపోయిన బొందయ్య అసలు విషయం తెలుసుకుని తప్పంతా పెద్దలదేనని నర్సింలు ఏమీ కలుపలేదని చెప్పడానికి పోలీస్ స్టేషన్ వెళ్ళాడు.

"బేకూఫ్....అప్పుడు రిపోర్టిస్తవు, ఇప్పుడు కాదంటవు, నాటుకమాడుతున్నవా..? మళ్లీ ఈ చుట్టుపక్కల యాడ కనపడ్డా పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపుత"... సెల్‌లో వున్న నర్సింలును, చెప్పడానికి వచ్చిన బొందయ్యను మెడలు పట్టి బయటకు నెట్టాడు ఎస్.ఐ. ●